




విసి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

వందశాతం ప్రగతి సాధిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్ వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 19న మూడవ శనివారం స్వర్ణ స్వచ్ఛంద కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఎలక్ట్రానిక్ ద్వారా రీసైక్లింగ్ అంశంతో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది అన్నారు. జిల్లా అంతటా పరిశుభ్రతతో పాటు తడి చెత్త పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పీఎం కుసుం కార్యక్రమాల ద్వారా సోలార్ ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఈల సర్వీసులు పట్టిష్టంగా నిర్వహించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇంటి దొంగల పనే..!



ఇంజిన్ల మాయంలో సూత్రధారులు వారే

అసలు దొంగలు దొరికేరా..?

అరెస్టులతో కదులుతున్న డొంక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'కియా'లో ఇంజన్లను ఇంటి దొంగలే మాయం చేశారు. ఇందులో భాగస్వామ్యులైన ఎనిమిది మందిని బుధవారం నాడు కోర్టు ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. మరికొంత మంది పట్టుబడాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు పట్టుబడిన వారి నుంచి చాలా వరకు సమచారాన్ని పోలీసులు స్వీకరించినట్టు సమాచారం. కోర్టులో ప్రవేశపెట్టాక జైలుకెళ్లిన వారిని మరోమారు కస్టడీకి తీసుకుని విచారించే అవకాశాలూ ఉన్నట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఐదేళ్లుగా ఇంజన్లను ఏ రకంగా మాయం చేశారు. ఎక్కడ వీటిని విక్రయించారు... మయమైన ఇంజన్లు ఎక్కడికెళ్లాయన్న యాంగిల్‌లో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

పాడుపడ్డాయని వెనక్కు పంపించే క్రమంలో మాయం

కియా పరిశ్రమలో కార్ల తయారీ కోసమని చెన్నైలోని హుందాయ్ కంపెనీల నుంచి కియా ఇంజన్లను కొనుగోలు చేస్తుంది. అక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టులో ఇండెంట్ ప్రకారం ఇంజన్లు వస్తాయి. వచ్చిన ఇంజన్లలో ఇక్కడ తీసుకున్న తరువాత అందులో లోపాలున్నాయని వెనక్కు పంపించేందుకు ఆర్డర్ పెడుతారు. అలా వెళ్లే క్రమంలో డిస్పాచ్ విభాగంలో గోల్‌మాల్ చేయడం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో ప్రస్తుతం పనిచేస్తున్న వారు... గతంలో పనిచేసి వెళ్లిన వారు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ రకంగా బయటకు తీసుకెళ్లిన ఇంజన్లను కొన్ని కార్ల మరమ్మతులు చేసే వారికి అమ్మగా, మరికొన్ని చెరుకు మిషన్లు, బోట్లకు వాడినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. పూర్తి స్థాయి సమాచారం రావాలంటే మరికొంత సమాచారాన్ని సేకరించాల్సినట్టు పోలీసులు భావిస్తున్నాయి. అసలు సూత్రధారులు ఇంకా పట్టుబడనట్టు తెలుస్తోంది. వారు కూడా పట్టుబడితే మొత్తం ఇంజన్ల దొంగతనం వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

అసలు సూత్రధారులు పట్టుబడితే పూర్తి వివరాలు బహిర్గతం

కియా ఇంజన్ల మాయం ఘటనలో ఇప్పుడు పట్టుబడిన వారిలో కీలక వ్యక్తులు కొంత మంది ఉన్నప్పటికీ మొత్తం వ్యవహారంలో మరింత కీలకంగా వ్యవహరించిన వారున్నట్టు తెలుస్తోంది. ఆ కీలక సూత్రధారులు పట్టుబడితే కియాలో ఇంజన్ల విభాగంలో జరిగిన దొంగతనం వ్యవహారం మొత్తం బయటకు వచ్చే అవకాశాలున్నాయి. అప్పుడు ఇంజన్ల దొంగతనం ఒక్కటేనా ఇంకా ఏవైనా ఇటువంటివి కియాలో చోటు చేసుకుంటున్నాయా అని కూడా బయటకొచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అయితే 900 ఇంజన్లు దొంగతనంకు గురైనట్టు గుర్తించారు. వీటి విలువ కనీసం రూ.50 కోట్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. అసలు సూత్రధారులు పట్టుబడితే ఆ విలువ అంతే ఉంటుందా ఇంకా ఏమైనా ఉందా అన్నది కూడా బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

అనంతపురం-బెంగళూరు రైలుకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా ప్రజలు అనేక సంవత్సరాల కోరికకు భారత రైల్వే శాఖ స్పందించింది. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరుకు నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే బోర్డు 2025 ఏప్రిల్ 15న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ రైలును ఏర్పాటు చేయాలంటూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో పాటు రైల్వే మంత్రి, రైల్వే అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నను వ్యక్తిగతంగా కలుసుకుని రైలు ఏర్పాటు అంశంపై మాట్లాడారు. ఈ మేరకు రైల్వే అధికారుల నుంచి అనంతపురం నుంచి రైలు బయలుదేరేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రైలు అందుబాటులోకి వస్తే అనంతపురం నుంచి బెంగుళూరుకు ప్రయాణం చేసే ప్రయాణికులకు ఉపయోగంగా ఉటుంది. ఈ రైలు ఇప్పటి వరకు ఉన్న స్టాపేజ్‌తో పాటు సోమేశ్వర, విధురాశ్వర్థం, కొత్తచెరువు, బసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లి, ప్రసన్నాయనపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు నిలబడుతుంది. రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ అతి త్వరలోనే కేంద్ర రైల్వే మంత్రి చేతుల మీదుగా అనంతపురం నుంచి రైలును ప్రారంభిస్తామని తెలియజేశారు.



ప్ల కార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి-మడకశిర

ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులు ప్ల కార్డుల ప్రదర్శన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని, డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగు లకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలని, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, తదితర ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపట్టారున. ధర్నాలో ఎన్ఎంయుఐ రీజనల్ మెంబర్ కరియప్ప, డిపో ట్రెజరర్ బిఎస్.నాయక్, ప్రెసిడెంట్ ముద్దప్ప, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం, అసిస్టెంట్ సెక్రటరీ జయసింహా, ఎస్‌డిఐ అజమత్, డ్రైవర్లు నాగరాజు, పాపన్న, మల్లికార్జున, షాజహాన్, కండక్టర్ సోము, గ్యారేజ్ బాబు, నరేష్, రసూల్, జియా, ఔట్ సోర్సింగ్ డ్రైవర్ బాషా పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని సర్వోదయ కళాశాలలో ఎపిఆర్‌జెసి, పాలిసెట్, ఆర్‌డిటి సెట్‌కు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప మాట్లాడుతూ సత్యసాయిబాబా భక్తుల సహకారంతో 50 మంది విద్యార్థులకు రూ.20,600 విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, ఈశ్వర్, కదరన్న, నంజప్ప, ఈరేగౌడ్, రామంజి, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన బిసి మహిళలకు ఉచిత శిక్షణతో పాటు కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. మండలంలో 7 కేంద్రాల్లో 90 రోజులు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్రలో భాగంగ చేనేత, టైలర్ల వద్ద మిగిలిన క్లాత్ ముక్కలను ఉపయోగించి సంచుల తయారీ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించిన వస్తు సామగ్రి, యంత్రాల కొనుగోలుకు రాయితీ ఇస్తుందన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గార్మెంట్స్ పరిశ్రమలో అవకాశం కల్పిస్తామన్నారు. పెనుకొండలో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గం లోని పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. పెనుకొండ నగర పంచాయతీని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలన్నారు. కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరందిస్తామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, నాయకులు నారాయణ స్వామి, వెంకటరాముడు, శ్రీనివాసులు, వెంకటరమణ, కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

మండలంలోని మోటువారిపల్లిలో రూ. 1.6 కోట్ల వ్యయంతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి రోడ్డు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల సంక్షేమం, అభివద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరందిస్తామని, అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామని, ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ. 15వేలు అందిస్తామని వివరించారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

కురుబవాండ్లపల్లి చెరువులో జలహారతి

మండలంలోని కురుబ వాండ్లపల్లి చెరువు కృష్ణా జలాలతో నిండిన నేపథ్యంలో మంత్రి సవిత గురువారం సాయంత్రం జల హారతి ఇచ్చారు. ఈ చెరువు నిండడం వల్ల చుట్టపక్కల రైతులకు చాలా ప్రయోజనకరమన్నారు. మంత్రి వెంట రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, వెంకటరాముడు, మండల కన్వీనర్ సిద్దయ్య, పెనుకొండ నగర పంచాయతీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, ఎర్రమంచి సర్పంచి నాగమూర్తి, త్రివేంద్రనాయుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు సిద్ధం

కార్మికులను పర్మినెంట్ చేస్తే ఆప్కాస్ రద్దుకు స్వాగతిస్తాం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్

ప్రజాశక్తి-హిందూపురం : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించక పోతే సిద్ధమవుతున్నట్లు ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ హెచ్చరించారు. ఆప్కాస్ లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, జీఓ నెంబర్ 36 ప్ర కారం ఇంజనీరింగ్ కార్మికులందరికీ రూ.21వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం హిందూపురం పట్టణంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు వినుత్నంగా ఇందిరా పార్క్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు గడ్డి తింటూ నిరసన ర్యాలీ నిర్వహించారు. నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు మల్లికార్జునతో పాటు నాయకులు అనంద్, రామచంద్ర, నారాయణ, బాలాజీ, చంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, కవితమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించా లని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ధర్మవరం మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ టి.అయుబ్ ఖాన్,



హిందూపురంలో గడ్డి తిని నిరసన వ్యక్తం చేసి మున్సిపల్ ఆరోగ్య అధికారికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

నాయకులు బాబు. ముకుంద. లక్ష్మీ ఓబులేసు. ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు కార్యదర్శులు బొగ్గ నాగరాజు, జయ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్ ఔర్సోర్సింగ్ పద్ధతిని రద్దుచేసి కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, కనీస వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్టు పద్ధతిని అమలు చేయడానికి కుట్ర పన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కార్మికులకు నష్టం జరిగే విధానాలు తీసుకొని వస్తే సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి రోడ్డు స్థలంలో గృహం తొలగింపు

రొద్దం : మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఎల్‌జిబి నగర్ గ్రామంలో ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ఆర్అండ్‌బి రోడ్డులో అంజి అనే వ్యక్తి ఇల్లు నిర్మించుకొన్నాడు. దీంతో ఆర్అండ్‌బి అధికారులు ఇల్లు తొలగించాలని పలు మార్లు తెలిపినా అతడు పట్టించు కోలేదు. దీంతో అధికారులు అంజికి నోటీసులు జారీ చేశారు. గురువారం రెవెన్యూ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య జెసిబి సాయంతో ఆ ఇంటిని పూర్తిగా తొలగించారు.



ఆర్అండ్‌బి రోడ్డులో ఉన్న ఇంటిని జెసిబి సాయంతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ట్రైసైకిల్ పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని తలమార్ల గ్రామానికి చెందిన సుదర్శన్ అనే మానసిక వికలాంగుడు నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో ఖద్మత్ ఏ ఖల్క్ స్పందించి దాతలు అన్నపూర్ణేశ్వరమ్మ, వరలక్ష్మి, జ్ఞాపకార్థంతో వారు ఆర్థిక సాయం చేయడంతో ట్రై సైకిల్ పంపిణీ చేశారు. తమ ట్రస్టు ద్వారా విద్యార్థులకు వికలాంగులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షాకీర్, రామాంజి, గోపీ తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్ ఫరూక్‌కు వినతి ఇస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరుతూ గురువా రం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో నగరపంచాయతీ ఛైర్మన్ ఉమర్‌ఫరూక్ వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు బాబావలి, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగిస్తే సకాలంలో వేతనాలు అందవన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సకాలంలో జమ చేయరని, ఉద్యోగ భద్రత కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జీవో-36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పనిముట్లు ఇవ్వాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ, చలపతి, లక్ష్మీదేవి, నరసమ్మ, మణి, ఖాదర్, వెంకటేష్, సిఐటియు నాయకులు తిప్పన్న, నరసింహ, ఆరిఫ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

ప్రజాశక్తి-అగళి

మండలంలో శుక్రవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సవిత, సత్య కుమార్‌తో పాటు ఎంపి పార్థసారథి పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ కుమారస్వామి గురువారం ఓ ప్రకటనలో కోరారు. మంత్రులు మండలంలోని ఇనగలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటైన 33/11కెవి సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారన్నారు. కావున మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

గుడిబండ : మండలంలో శుక్రవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సవిత, సత్యకుమార్, ఎంపి పార్థసారథి పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి చొరవతో కెకె పాల్యం గ్రామానికి 33/11 కెవి విద్యుత్ స్టేషన్ మంజూరైందన్నారు. ఈ సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు, ఎంపి పాల్గొంటారని, కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు నాయకులు శివకుమార్, వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, లక్ష్మీనరసప్ప, ప్రకాష్ ఉన్నారు.

ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

శ్రీ సత్యసాయి జిల్లా ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గౌస్ లాజమ్‌ను మండలంలోనితంగేడు కుంట ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకట చలమయ్య మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు ఉపాధ్యాయ సంఘంలో కొనసాగుతూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు గౌస్‌లాజమ్ అని అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా అరుదైన గౌరవం లభించిందన్నారు. ఈ సందర్భంగా గౌస్ లాజమ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, టోపీవలి, సుధాకర్ పుట్టా, సోమశేఖర్ నాయక్, ఎన్‌సి. నరసింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలో ప్రభుత్వ చౌక ధాన్యపు చౌక ధాన్యపు డిపోల పరిధిలోని రేషన్ లబ్ధిదారులందరూ సంబంధిత డీలర్ల వద్ద తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ అనంత ఆచారి, సివిల్ సప్లైడిప్యూటీ తహశీల్దార్ విజయ నిర్మల కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఓడి చెరువు మండల డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని డీలర్లు అందరూ ఈ నెలా ఖరులోగా రేషన్ లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించాలన్నారు. లబ్ధిదారులు కూడా డీలర్లకు సహకరించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు, ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ లబ్ధిదారులను కార్డు నుంచి తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ సమావేశంలో డీలర్లు పాల్గొన్నారు.

వేతనాల కోసం సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి-గుడిబండ

ఆయుష్మాన్ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం సిహెచ్‌ఒలు స్థానిక పిహెచ్‌సి ఆవరణలో డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఫొటో : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

గ్రామాలలో శ్మశానవాటికలకు స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ స్పందించి ఆయా గ్రామాల్లో శ్మశానవాటికలకు స్థలం కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కొత్తచెరువు మండల పరిధిలోని ఇరుగంపల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఇరగంపల్లి, వంగంపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు లేక కాలువ గట్లల్లోనూ, చెరువు మునగల్లోనూ మృతదేహాలను ఖననం చేస్తున్నారన్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యలపై ఈనెల 23వ తేదీ ఇరగంపల్లి నుండి కొత్తచెరువు వరకు సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, సిపిఎం పుట్టపర్తి ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, లక్ష్మన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒల శాంతియుత నిరసన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం శాంతియుత నిరసన తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాలలో గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న సిహెచ్‌ఓలు జీతభత్యాలు, ఉద్యోగ భద్రతపై సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమంగా 23% వేతన సవరణ, ఈపీఎఫ్ పునరుద్ధరణ, పని ప్రోత్సాహకాలు, ట్రాన్స్ఫర్, ఇంక్రిమెంట్, ఎచ్ఆర్ పాలసీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశ్శారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దాదాపుగా మూడు నెలల నుండి బిల్లులు రాక కూలీలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. పనిప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు లేవన్నారు. అలాగే పని దినాలను 200 రోజులు పెంచాలని రోజుకూలి రూ400 చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామచంద్ర, మండల కన్వీనర్ చలపతి, మహిళా అధ్యక్షురాలు రత్నమ్మ, రవికుమార్, లక్ష్మీనరసింహ ,రమణప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి-హిందూపురం

వివిధ కేసుల్లో ఉపకారాగారంలో ఉన్న వైసిపి నాయకులను ఆ పార్టీ నేతలు నాయకుడు వేణురెడ్డి ఆధ్వర్యంలో గురువారం పరామర్శించారు. సబ్‌జైలులో ఉన్న వైసిపి నాయకులు సూరి, శివను నాయకులు కలసి పరామర్శించారు. ఆధైర్యపడవద్దని, అందరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసిఫుల్లా, ఎన్.ఎ. శివ, తిప్పేరుద్రయ్య, నక్కలపల్లి శ్రీరామరెడ్డి, దాదాపీర్, ధనుంజయ రెడ్డి మనోజ్, ఫరూక్, హనుమంత్ రెడ్డి, నవీన్, అబ్రహం, రామాంజి, హరి, రవిరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలపై సమీక్ష

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్య సాయి జిల్లాలో కస్తూరిబాయ్ బాలికల విద్యాలయాలలో 2024. - 25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ లో వచ్చిన ఫలితాలపై గురువారం ఏపీ సమగ్ర శిక్షణ సత్యసాయి జిల్లా కార్యాలయంలో కెజిబివి ప్రిన్సిపాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయ అధికారి డాక్టర్ పి దేవరాజు, మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థినికి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కేజీబీవీల్లోని 12 కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని మిగిలిన వాటిలో కూడా వందశాతం సాధించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మంచి మార్కులు రావడానికి కృషి చేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ ఉద్యోగుల తమ సమస్యలు పరిష్కరించాలని మూడవ విడత ఉద్యమ నిరసన తెలిపారు. గురువారం డిపో గేటు ముందుధర్నా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపుమేరకు డిపో అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీరామ్ నాయక్, షబ్బీర్, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర మంత్రులు జిల్లాలో శుక్రవారం పర్యటిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లో దాదాపు నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించనున్న 33/114 కెవి సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవంలో మంత్రులు పాల్గొంటారన్నారు.

భూములపై హక్కులు కోల్పోవద్దు : ఎపి రైతుసంఘం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రైతులు తమ భూములపై హక్కులను కోల్పోవద్దని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి, పెద్దన్న కోరారు. ఈ మేరకు వారు గురువారం మండల పరిధిలోని వంకమద్ది, గురికానివారిపల్లి, పెదరాంపల్లి, పుల్లగురవాండ్లపల్లి, తాటిమానుగుంత, ఒర్సువాండ్లపల్లి, రంగనపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామాలలోని రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు మాయమాటలు చెప్పి సోలార్ ప్రాజెక్ట్ పేరుతో భూములను వశం చేసుకుంటారని తెలిపారు. ఈ గ్రామాలలో గొర్రెలు,మేకలు, మూగా జీవాలైన పశువులను మేపుకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. సోలార్ నిర్మాణాలు చేపడితే ఇలాంటి కుటుంబాలు రోడ్డునపడతాయని, సోలార్ ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇవ్వకుండా అడ్డుకోవాలని కోరారు. ప్రజల తరుపున జిల్లా రైతు సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. శుక్రవారం జవకల గ్రామంలో జరిగే సభకు రాష్ట్ర నాయకులు ప్రభాకర రెడ్డి హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో రైతులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి : జిల్లాలో మామిడి పంట సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, హరి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలలో మామిడి సుమారు 53385 ఎకరాలలో సాగులో ఉందన్నారు. ఎకరాకు 3నుంచి 5టన్నుల మామిడి దిగుబడి వస్తుందన్నారు. అయితే ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా రావడం వివిధ రకాల తెగుళ్ల వలన పంట దిగుబడి ఆశించినంతగా లేదన్నారు. జిల్లాలో ఎన్ పి కుంట, తనకల్లు, గాండ్ల పెంట, ఒడిసి , నల్లమాడ, కదిరి, పుట్టపర్తి, బుక్కపట్నం, ముదిగుబ్బ, కొత్తచెరువు, పరిగి, రొద్దం, లేపాక్షి మండలాలలో ఎక్కువ విస్తీర్ణంలో మామిడి సాగులో ఉందన్నారు. రైతులు మామిడి అమ్మాలంటే దళారులు , ప్రైవేట్ మార్కెట్ల పై ఆధారపడాల్సిందేనన్నారు. జిల్లాలో సరైన మార్కెట్ సౌకర్యం లేక పక్క రాష్ట్ర లకు పోవలసి వస్తుందన్నారు. రవాణా, కమీషన్లు, కోత ఖర్చు పెరిగి, హమాలీ, మార్కెట్ ఖర్చుల వల్ల రైతులకు మోయలేని భారం అవుతుందన్నారు. రవాణా చేయలేని రైతులు తక్కువ ధరలకే వ్యాపారస్తులకు అమ్మడం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. ఈనేపథ్యంలో రైతుల సౌకర్యార్థం కోసం అన్ని మండలాలో ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తూ, విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌'ఫార్మర్' కష్టాలు



ఎస్ఇ కోసం కార్యాలయ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందుల్లో రైతులు
రూ. లక్షలు పెట్టి బోర్లు వేసినా కరువైన విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

దేశానికి వెన్నెముక అయిన రైతులకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో వీరి అవస్థలు వర్ణనాతీతం. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పు చేసి బోర్లు వేసినా అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో తమకు ఆత్మహత్యే శరణ్యం అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన రైతులు తమకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలంటూ గురువారం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయానికి వచ్చారు. వీరు లక్షలాది రూపాయలు వెచ్చించి తమ పొలాల్లో బోరుబావులను రెండుసంవత్సరాల క్రితం తవ్వుకున్నారు. అందులో నీరు లభించడంతో విద్యుత్ సౌకర్యం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం 2023లో ఏపీఎస్పీడీసీఎల్ పేరిట ఒక్కో రైతు 45 వేల రూపాయలు చొప్పున డీడీ తీశారు. అయితే ఇప్పటి వరకు కూడా వారికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వచ్చినా కేబుల్, మెటీరియల్ రాలేదంటూ ఏఈ శివయ్య కుంటిసాకులు చెప్పుతున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి వద్ద అలాట్మెంట్ తీసుకువస్తే కేబుల్, మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని చెబుతున్నారని అన్నారు. అన్ని పనులు వదులుకొని 70 కిలోమీటర్లు ప్రయాణించి జిల్లా కార్యాలయానికి రావాలంటే కష్టతరంగా మారిందని ఆవేదన చెందారు.

అందుబాటులో లేని సూపరింటెండెంట్ ఇంజనీర్

రైతులు మాత్రం ప్రతిరోజు ఈదుల ముష్టూరు నుంచి ప్రతి రోజూ జిల్లా కార్యాలయాలని వచ్చి వెళుతున్నారు. దాదాపు 70 కిలోమీటర్ల వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కార్యాలయానికి వచ్చి సమస్య చెప్పుకుందాం అంటే సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేంద్ర మాత్రం తమకు చిక్కడమే లేదని రైతులు వాపోతున్నారు. అక్కడ చూస్తే ఏఈ స్పందించడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంతో తమ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌లోకి మహిళ
న్యాయ చేయాలంటూ అధికారుల వద్ద మొర



అధికారికి సమస్యను వివరిస్తున్న బాధిత మహిళ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రామగిరి మండలం గొంతుమర్రిలోని తన ఇంటి స్థలంలో తన బాబాయి ప్రహరీ నిర్మిస్తున్నాడని చెప్పి పొలేరమ్మ అనే మహిళ పెట్రోల్ బాటిల్ చేత పట్టుకొని కలెక్టరేట్ కార్యాలయానికి గురువారం వచ్చింది. అది గమనించిన ఎస్ఐ శ్రీరాములు అడ్డుకొని పెట్రోల్ బాటిల్ తీసుకొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. బాధితురాలు మాట్లాడుతూ తన స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను తొలగించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకొన్నారు. స్పందించిన కలెక్టర్ ఆమె సమస్యను పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డిని ఆదేశించారు. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోలేరమ్మను విచారించి వివరాలు సేకరించారు. గొంతుమర్రిలో డోర్ నెంబరు 1.5 సెంట్లులో సొంత ఇల్లు ఉందని బాధిత మహిళ తెలిపింది. తనకు సంబంధించిన ఖాళీ జాగాలో తన బాబాయి ఓబులేసు అనే వ్యక్తి అక్రమంగా గోడ నిర్మించారని వాపోయిందిజ ఆ గోడను తొలగించాలని ఎంత కోరినా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా స్థానిక సర్వేయర్, వీఆర్వో తన బాబాయికే సహకరించి తనకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించింది. కలెక్టరు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్య శరణ్యమని అంది.

బీసీలకు అన్యాయం చేస్తే సహించం

ప్రజాశక్తి - బత్తలపల్లి

బీసీల ఓట్లతో గద్దెనెక్కి అధికార అహంభావంతో బీసీలను దెబ్బతీస్తే ఏ రాజకీయ పార్టీ నాయకులను సహించబోమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు హెచ్చరించారు. గురువారం రాత్రి మండల కేంద్రమైన బత్తలపల్లికి వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ నాయకులకు బీసీ సంక్షేమ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశన శంకర్రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకులపై దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడితే ఆయా రాజకీయ పార్టీ నాయకుల గుండెలలో నిద్రపోతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు నామాల శంకర, జిల్లా నాయకులు మహేష్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే తిరుపతయ్య, ప్రజా సంఘాల నాయకులు సాకే లక్ష్మన్న,ఎరుకల వెంకటనారాయణ, రామాచారి,చాకల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శుద్ధజల కేంద్రం ప్రారంభం



శుద్ధ నీటిని అందిస్తున్న డా॥హరిప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి రూరల్ కుమ్మరవాండ్లపల్లిలో ఉచిత సురక్షిత శుద్ధ మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తాగునీరు కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో దీనిని ప్రారంభించినట్లు చెప్పారు. బత్తల గంగన్న, బత్తల గంగులమ్మ జ్ఞాపకార్థం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, వైస్ ఎంపీపీ అదినారాయణ, కన్వీనర్ మణికంఠ నాయక్, యేసు, కౌన్సిలర్ షబ్బీర్, కాంట్రాక్టర్ బాబా, జాకీర్ బాయి, నజీర్, నాయుడు బావాజీ, పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారుల బృందం సూచించింది. గురువారం పట్టణంలోని మేళాపురం రూపశ్రీ వృద్ధాశ్రమం, బాలాజీ నగర్ లోని వెంకటేశ్వర సీనియర్ సిటిజన్స్ హోంలలో జిల్లా ప్రభుత్వాస్పత్రి, శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సి డిప్యూటెడ్ స్పెషలిస్ట్ వైద్యుల బందం మల్టీస్పెషాలిటీ సమగ్ర వృద్ధాప్య ఆరోగ్య అంచనా శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. వృద్ధాశ్రమాల్లోని మొత్తం 50 మందికి బీపీ, హెచ్.బి. ఆర్బీఎస్, ఈసీజీ స్క్రీనింగ్ తో పాటు నేత్రాలు, ఆర్థోపెడిక్, దంతాలు, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్టీ, ఫిజియోథెరఫీ విభాగాల్లో పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ, వృద్ధాశ్రమాల్లో ఉన్న వృద్ధుల ఆరోగ్యాన్ని అంచనా వేసి వారికి సరైన వైద్యం. మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ విజయ్ బాబు, వైద్యులు అనురాధ, నవీన్, నీరజ, మంజునాథ్. జీవన, ప్రశాంత్, గంగరత్న సిబ్బంది పాల్గొన్నారు.

'పురం' అభివృద్ధికి నిధులు కేటాయించాలి
16వ ఆర్థిక సంఘం సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు విరివిగాని నిధులు కేటాయించాలని ఆర్థిక సంఘం సభ్యులు, మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పగారియాను కోరారు. గురువారం తిరుపతిలో జరిగిన 16 వ ఆర్థిక సంఘం సమావేశంలో ఆర్థిక సంఘం సభ్యుని హోదాలో పాల్గొన్న డిఇ రమేష్‌కుమార్ మాట్లాడుతూ నిధుల మంజూరులో హిందూపురానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం సంఘం ఛైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు సూచనలు చేస్తూ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

దర్గా కమిటీ అధ్యక్షులుగా మాణిక్యం బాబా


ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి దర్గా నూతన కమిటీని ఆమోదిస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని అనంతపురం బోర్డు ఆడిట్ ఇన్స్పెక్టర్ మణిక్యం బాబాకు అందించారు. దర్గా కమిటీ నూతన అధ్యక్షులుగా మాణిక్యం బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా జగరాజుపల్లి అబ్దుల్ షఫీ, కార్యదర్శిగా ముంటిమడుగు ఇమాంసాబ్, కోశాధికారిగా సయ్యద్ అన్వర్ లతోపాటు కార్యవర్గ సభ్యులుగా రోషన్ సాబ్, నబి రసూల్, ఏజాజ్, బద్వేల్ షర్ఫుద్దీన్ , సలీం ఖాన్ ఎంపికయ్యారు. నూతన కమిటీ ఏర్పాటు పట్ల కొత్తచెరువు గ్రామ ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇండియన్ ట్యాలెంట్ పరీక్షల్లో
సరస్వతి విద్యామందిర్ విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-హిందూపురం

ముంబైకి చెందిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన పట్టణానికి చెందిన శ్రీ సరస్వతి విద్యామందిరం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు బంగారు పతకాలు వచ్చినట్లు ప్రధానాచార్యులు ఆంధ్రరత్నం అశోక్ కుమార్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇంటర్నేషనల్ డ్రాయింగ్ కాంపిటిషన్ లో 7వ తరగతి విద్యార్థిని దీక్షిత, 8వ తరగతి విద్యార్థిని సాయి వర్ష, 7వ తరగతి విద్యార్థిని ఖుష్బూ కుమారికి గోల్డ్ మెడల్స్ లభించినట్లు చెప్పారు. అలాగే ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో 6వ తరగతి సాయి వర్షిత ఎక్సలెన్స్ మెడల్ అవార్డు పొందిందన్నారు. ఇంటర్నేషనల్ సోషియల్ స్టడీస్ ఒలంపియాడ్ లో 8వ తరగతి విద్యార్థిని ఏ.పవిత్రకు స్టేట్ లెవెల్ 6వ ర్యాంకు సాధించి స్కాలర్ షిప్ గెలుచుకుందన్నారు. వీరితో పాటు 35 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సైతం తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల ఆచార్యులు రాఘవేంద్ర, సోమశేఖర్, ప్రశాంతి, పూజా, లక్ష్మి, రాధ తదితరులు అభినందించారు.



ప్రశంసా పత్రాలతో ప్రతిభా విద్యార్థులు

నేరాలు ఘోరాలు

దొంగలు అరెస్టు
11 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బత్తలపల్లి

పనిలేకుండా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడి మోటారు సైకిళ్ల అపహరించుకొని వెలుతున్న ఆరుగురు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ. 10 లక్షలు విలువ గల 11 మోటారు సైకిళ్లు. స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. అనంతపురం పట్టణంలో నివాసముంటున్న ప్రణయ్, ధనూష్, సిద్ది వినయ్ తో పాటు మరో ముగ్గురు మైనర్లు కలిసి జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతుండేవారు. బత్తలపల్లిలోని హైవే జంక్షన్లో డీఎస్పీ హేమంత్‌కుమార్, సిఐ ప్రభాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో గురువారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా వీరు అరుగురు రెండు ద్విచక్రవాహనాల్లో వెలుతుండగా అనుమానం వచ్చి విచారణ జరిపారు. ఆ సమయంలో వారు పొంతనలేని సమాధానం ఇవ్వటంతో తమదైన శైలిలో విచారించారు. బత్తలపల్లి, ధర్మవరం అనంతపురం టౌన్ పరిదిలో మొత్తం 11 మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారు. ఈ నేపథ్యంలో వారి నుంచి రూ.10లక్షలు విలువ గల 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై ఇప్పటికే బత్తలపల్లిలో 2, ధర్మవరంలో 4, అనంతపురంలో ఐదు కేసులు నమోదయినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన కాకర్ల రవితేజ(34) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రవితేజ ఎలాంటి ఉద్యోగం చేయకుండా ఉండడంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది బుధవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని పొలంలోకి వెళ్లి పప్పుశనగ విత్తనాల్లో కలిపే మాత్రలు మింగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. దీంతో వారు హుటాహుటిన పొలం వద్దకు వెళ్లి అతడిని పావగడ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి తుమకూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో గురువారం అక్కడే వైద్యులు పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని కోవెలగుట్టపల్లి సమీపంలోని పొలాల్లో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పుట్టపర్తి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించే సమయంలో గ్రామంలోని గంగమ్మ గుడి వెనుక వైపు గుట్టలో జూదం ఆడుతున్న స్థావరం పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.60,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు.

టిప్పర్ ఢీకొని రైతుకు గాయాలు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడితోట గ్రామంలో గురువారం టిప్పర్ ఢీకొని అదే గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామంలో మట్టి తరలిస్తున్న ట్రిప్పర్ ద్విచక్రవాహనంలో వెళుతున్న అదే గ్రామానికి చెందిన రైతు సుధీర్‌కుమార్‌రెడ్డిని ఢీకొంది. ఈ ప్రమదంలో సుధీర్ కుమార్ రెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ప్రమాద విషయం తెలుసుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించి టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి యాదవ్ తెలిపారు.

అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలోని దొరిగల్లు క్వాటర్స్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతిచెందడంతో ఆగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వల్లెపు మునికృష్ణ నాలుగు రోజుల క్రితం ములకల చెరువు సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరుడు వల్లెపు రమణ (46) మద్దిలేరు ప్రాజెక్టు దిగువ ఉన్న గుర్రాల మడుగులు పడి మృతిచెందాడు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. ఇద్దరి మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రిలోనే ఉన్నాయని మృతుల బంధువులు తెలిపారు.

గ్రామసభ వాయిదా

ప్రజాశక్తి- పావగడ

తాలూకాలోని వెంకటాపుర గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభ సమావేశానికి అధ్యక్షుడు వెంకటరమణప్ప, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి మినహా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో గ్రామసభ వాయిదా పడింది. అధ్యక్షుడు వెంకటరమణప్ప మాట్లాడుతూ సమాచారం ఇచ్చినా సభ్యులు గ్రామ సభకు హాజరు కాలేదని తెలిపారు. పిడిఒ మహ్మద్‌రఫీక్ మాట్లాడుతూ 2023-24కు సంబంధించి నరేగా, 15వ ఆర్థిక, సామాజిక సర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించగా, అధికారుల బృందం హాజరై గ్రామ పంచాయతీ ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారన్నారు. గ్రామస్తులు స్పందిస్తూ గతంలో పిడిఒ హనుమరాజు హయాంలో పలు పనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. గ్రామసభకు పిడిఒ హాజరుకావాలని గ్రామ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డా. అనూష, సామాజిక ఖాతాల విభాగం మేనేజర్ రామకృష్ణగౌడ్, జిల్లా పంచాయతీ సామాజిక ఖాతాల మేనేజర్ జయరామ్, ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు కోరారు. ఈ మేరకు వారు ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల క్షేత్ర సహాయకుల సంఘం అధ్యక్షులు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి ఉత్తప్ప మాట్లాడుతూ రాష్ట్రక్షేత్ర సహాయకుల యూనియన్ పిలుపు మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశామన్నారు. ఐదేళ్ల నుంచి పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలు, కనీస దినసరి వేతనం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం క్షేత్ర సహాయకులను ఆదుకోవాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం రూ. 10లక్షల ప్రమాద బీమా చెక్కును బాధితులకు పంపిణీ చేశారు. అమరాపురానికి చెందిన మడివాలప్ప అనే వ్యక్తి ఏడాదికి రూ. 550 చెల్లించి తపాలాకార్యాలయంలో ప్రమాద బీమా పొందారు. అయితే ఇటీవల ఆయన ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై మృతిచెందాడు. దీంతో ప్రమాద బీమా నిబంధనల మేరకు మృతుడి నామినీగా ఉన్న సాకమ్మకు రూ. 10 లక్షల బీమా మొత్తాన్ని అమరాపురం ఉప తపాలా కార్యాలయంలో అందజేశారు.

టిడిపి జిల్లా కార్యాలయాన్ని పరిశీలించిన పల్లె

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా టిడిపి అధ్యక్షులు అంజినప్ప గురువారం పరిశీలించారు. పుట్టపర్తి సమీపంలోని మామిళ్ళ కుంట సమీపంలో నూతన కార్యాలయం రూపుదిద్దుకుంది. ఈ నూతన కార్యాలయాన్ని గురువారం పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పరిశీలించారు. కార్యాలయంలో ఫర్నిచర్ తో పాటు ఫ్యాన్లు కుర్చీలు తగినన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ , జిల్లా మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు ,ఎంపీ చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.